క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్


కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. సోమవారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని సెలవు కారణంగా మంగళవారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, 10.30 నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ప్రాంతాల్లోని సమస్యలను నగరపాలక సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

న్యాయ వ్యవస్థదే కీలక పాత్ర


న్యాయవాది శ్రీనివాసరావును సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థదే కీలక పాత్ర అని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తాము వేసే శాసనాలకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగ విలువలను ప్రభుత్వం ఉల్లంఘిస్తే వాటిని గాడిన పెట్టే బాధ్యత న్యాయ వ్యవస్థకు ఉంటుందన్నారు. అనంతరం ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, ప్రసాదనాయుడు, సుబ్బారావు, రాజా, చంద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ


ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న రత్నప్రసాద్

కాకినాడ రూరల్: మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు సోమవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మాట్లాడుతూ, సమాజంలో అశాంతి నెలకొన్నప్పుడు, ప్రజలంతా పక్కదారి పట్టినప్పుడు వారిని సన్మార్గంలో నడిపించేందుకు మహా పురుషుడు మహా ప్రవక్త మొహమ్మద్ అవతరించారన్నారు. ఆయన జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ ముస్లిం సోదరులకు పెద్ద పండగన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసరావు, చింతపల్లి సుబ్బారావు, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయిలు చెల్లించాలి

కాకినాడ సిటీ: పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం జిల్లా సీఐటీయూ భవనంలో సోమవారం జరిగింది. వక్తలు మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీల్లో కార్మికులకు నెలల తరబడి వేతనాల బకాయిలు ఉన్నాయన్నారు. ఈ బకాయిలను వెంటనే చెల్లించి విధిగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం ఇచ్చి, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2015లో కోర్టు తీర్పు ప్రకారం.. కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, కోర్టు తీర్పును అమలు చేయని అధికారులపై, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్మికులపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు ఎన్నికలు జరపాలి

కాకినాడ: తక్షణమే కాకినాడ నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారి పాలన ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2005లో నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయ్యాక 2010తో మొదటి పాలకవర్గ పదవీకాలం ముగిసిందన్నారు. పరిసర గ్రామాల విలీనం పేరుతో ఏడేళ్ల పాటు ఎన్నికలకు దూరంగా ఉంచి, 2017లో మళ్లీ ఎన్నికలు నిర్వహించారన్నారు. తాజా పాలకవర్గ పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎ.సత్తిరాజు, మడక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బై బై గణేశా..

- వైభవంగా గణపతి విగ్రహాల నిమజ్జనాలు
- నగరంలో అంబరాన్నంటిన వేడుకలు
- ఎటుచూసినా సందడి వాతావరణం



జగన్నాథపురం ఉప్పుటేరులో క్రేన్ సాయంతో చేస్తున్న గణపతి విగ్రహాల నిమజ్జనం

బోట్‌క్లబ్: గణపతి నవరాత్రుల సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల్ని సోమవారం నిమజ్జనం చేశారు. స్థానిక వార్పురోడ్డులోని 4 ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేసిన చోట్ల నిమజ్జనాలు జరిగాయి. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుల్ని ఉప్పుటేరులో నిమజ్జనం చేశారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన చిన్న గణేశ్ విగ్రహాలను కుటుంబ సమేతంగా తరలివచ్చి నిమజ్జనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ర్యాలీగా వచ్చిన యువకులు డీజేమార్ నృత్యాలు చేస్తూ నిమజ్జనాల్లో పాల్గొన్నారు. నగరంలో 4 ప్రాంతాల్లో 10 బోట్లు, 30 మంది గజ ఈతగాళ్ల సహకారంతో నిమజ్జనాలను నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది సహా, వివిధ శాఖల అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. నగరంలోని వివిధ కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను స్థానిక మెయిన్ రోడ్డు మీదుగా జగన్నాథపురం వరకూ ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనాలు చేశారు.

సందడే సందడి

నగరంలో దాదాపు అన్ని వీధుల్లోను వినాయకుడి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆయా విగ్రహాల్ని నిమజ్జనం చేసేందుకు కమిటీల వారు భారీ ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం ప్రాంతం వరకూ భారీ ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా పేల్చి, డప్పులు, బాజాభజంత్రీలతో ఊరేగింపు చేశారు. ఏ వీధిలో చూసినా సందడే కనిపించింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా నిమజ్జన వేడుకల్లో పాలుపంచుకున్నారు.

ప్రత్యేక బందోబస్తు

నిమజ్జనాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు, పలు ప్రాంతాల్లో పోలీసులు భారీఎత్తున మోహరించారు.

మేళతాళాలు.. బాజాభజంత్రీల నడుమ..

కాకినాడ రూరల్: వినాయక నవరాత్రులు ముగియడంతో నిమజ్జనోత్సవాలు గ్రామాల్లో సందడి చేశాయి. గ్రామగ్రామాన, వీధివీధిన మంటపాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీల వారు పండగ వాతావరణంలో నిమజ్జనాలకు తరలించారు. కాలనీలోని, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన గణపతులను మహిళలు, చిన్నారులు ఉత్సాహభరితంగా నిమజ్జనాలకు తోడ్కొనివెళ్లారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని రూరల్ మండలంతో పాటు, కరప మండలంలోనూ సోమవారం నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. రూరల్ మండలంలోని విగ్రహాలను సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనాలు చేశారు. మరోవైపు వినాయక మంటపాల వద్ద అన్నదానాలు, లడ్డూల వేలం పెద్దఎత్తున నిర్వహించారు. తిమ్మాపురం గ్రామ పరిధిలోని అచంపేటనగర్‌లో వేలంపాటలో లడ్డూ రూ.లక్ష పలికింది. పలు గ్రామాల్లో లడ్డూల వేలంపాటల్లో స్థానికులు ఉత్సాహంగా పాల్గొని, ప్రసాదంగా పంచిపెట్టారు. కరప మండలం పెనుగుదురు, అరట్లకట్ల, వేళంగి గ్రామాల పరిధిలో కాల్వల వద్ద నిమజ్జనాలు నిర్వహించారు.


సూర్యారావుపేట బీచ్ వద్ద క్రేన్‌తో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న సిబ్బంది


విద్యుత్‌నగర్‌లో నిర్వహిస్తున్న భారీ ఊరేగింపు


ఇంటి వద్ద గణనాథులను నిమజ్జనం చేసేందుకు మోసుకెళుతున్న భక్తులు


శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని ట్రాలీపై తరలిస్తున్న భక్తులు


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీవాసుల గణపతి ఊరేగింపు


సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనానికి విగ్రహాన్ని మోసుకెళ్తున్న భక్తులు


కరప గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపు

నిమజ్జన ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

కాకినాడ సిటీ: కాకినాడ డివిజన్‌లో జరిగే వినాయక చవితి, గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సోమవారం కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ సమీక్షించారు. కాకినాడ నగరం జగన్నాథపురం, కాకినాడ రూరల్ సూర్యారావుపేటల్లో ఏటా పెద్ద ఎత్తున చేస్తున్న గణేశ్ నిమజ్జనాలకు సంబంధిత శాఖల అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లను మున్సిపల్, పంచాయతీ అధికారులు చేయాలన్నారు. భారీ క్రేన్లు పోర్టు డిపార్టుమెంట్ ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా పరంగా బారికేడ్లను ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏటా విగ్రహాల సంఖ్య పెరుగుతున్నందున భద్రతాపరంగా పోలీస్ శాఖకు సమాచారం తెలియజేయాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ, నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జనాలు నిర్వహించాలని నిర్వాహకులకు తెలిపారు. కార్పొరేషన్ డీఈ మాదవి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దూసర్లపూడి రమణరాజు, దుప్పూరి సుబ్రహ్మణ్యం, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మున్సిపల్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖలు, పోర్టు, మత్స్య, ఆర్అండ్‌బీ శాఖలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.


నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ

నర్సుల పోరాటానికి విశేష మద్దతు

కాకినాడ క్రైం: తమ విధులను క్రమబద్ధీకరించాలని కోరుతూ కాకినాడ జీజీహెచ్‌లో ఏపీ స్టేట్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసనకు దిగిన కాంట్రాక్టు బేసిక్ స్టాఫ్ నర్సులకు విశేష మద్దతు లభిస్తోంది. వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆస్పత్రిలో దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటిస్తున్నారు. ఇప్పటికే ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల రెగ్యులరైజేషన్ డిమాండ్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని కాకినాడలో ప్రకటించగా, అదే బాటలో పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఏపీ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సామినాయుడు, ఏపీజేఏసీ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వామిబాబు, కాకినాడ జీజీహెచ్ బ్రాంచ్ అధ్యక్షుడు కె.మోహనరావు, వ్యక్తం జీజీహెచ్ బ్రాంచ్ ట్రెజరర్ ప్రసన్నకుమార్, బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ ఎస్‌కే అలీషా, ఎన్‌జీవో నాయకులు ధనలక్ష్మి, కృపావతి తదితరులు సోమవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, అరకొర జీతాలతో బతుకీడుస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. 115 జీవోపై ప్రభుత్వం నేరుగా స్పష్టతనివ్వాలని కోరారు.


నిరసనకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

అరుణాచలం యాత్రకు బస్సు


బస్సును ప్రారంభిస్తున్న డీఎం మనోహర్

కాకినాడ: అరుణాచలం యాత్ర కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును కాకినాడ డిపో మేనేజర్ ఎం.యూవీ మనోహర్ సోమవారం ప్రారంభించారు. కాకినాడ నుంచి ఉదయం 12 గంటలకు బయలుదేరిన ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుని, అక్కడ గిరిప్రదక్షిణలు పూర్తయ్యాక కంచి, కాళహస్తి దర్శనం అనంతరం 20వ తేదీ రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుకుంటుందని డీఎం వివరించారు.

ఘనంగా మీలాద్ ఉన్ నబీ వేడుకలు


మిలాద్ ఉన్ నబీ సందర్భంగా స్వీట్లు పంచుతున్న ముస్లింలు


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నగరంలో ముస్లింల భారీ ర్యాలీ

కాకినాడ: మహా ప్రవక్త మొహ్మద్ (సఅవ) జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక జె.రామారావుపేట నుంచి సినిమా రోడ్డు, టూటౌన్ మీదుగా తిరిగి జగన్నాథపురం వరకు ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి స్థానిక పెద్ద మసీదు సెంటర్‌లో పెద్ద మసీదు వద్ద జామియా మసీదు అధ్యక్షుడు జజాబుద్దీన్ స్వాగతం పలికారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్‌తో పాటు, పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ముస్లింలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ ఇమామ్ గౌసమొహిద్దీన్ మాట్లాడుతూ, మొహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలన్నారు. సమాజంలో ఒకరిపై ఒకరు ద్వేషం, మత సామరస్యాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. స్థానిక కల్పనా సెంటర్ వద్ద సిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వాగతం పలికారు. అలాగే టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నగర ఉత్సవ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు, గట్టి సత్యనారాయణ, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, దుప్పూరి సుబ్రహ్మణ్యం తదితరులు స్వాగతం పలికి. అభినందనలు తెలిపారు.

నేటి నుంచి అధికారులకు శిక్షణ

సామర్లకోట: శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న 11 జిల్లాల్లోని మండల స్థాయి అధికారులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం నుంచి శిక్షణ ఇస్తున్నట్టు కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు బ్యాచ్‌ల్లో పంచాయతీరాజ్ అధికారులు, విధులపై మూడు రోజుల చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. తొలి బ్యాచ్ 17 నుంచి 19 వరకుంటుందని చెప్పారు.

ఓజోన్ రక్షణ అందరి బాధ్యత

ప్రపంచ ఓజోన్ దినోత్సవంలో వక్తలు

కాకినాడ సిటీ: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి బీవీవీ కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్ కాస్ట్)లో వివిధ పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, ఎకోపాత్రాళినయం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు 54 పాఠశాలల నుంచి 386 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆధునిక జీవనం పేరిట రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల వాడకం పెరగడం కూడా ఓజోన్ పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ సీహెచ్ రవి, రేయూనా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్ విక్రమార్ మాట్లాడారు. జీవావరణానికి రక్షణ కవచంగా ఉండే ఓజోన్ పొర మానవ స్వయం కృతాపరాధం వల్ల నానాటికి చిల్లులు పడి అంతరించే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. కాలుష్యం వల్ల ఓజోన్ పొర నెమ్మదిగా కరుగుతున్నట్టు పర్యావరణ నిపుణులు గుర్తించారన్నారు. ఓజోన్ పొరపై వాహనాల నుంచి వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్ తీవ్ర ప్రభావం చూపుతుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మెర్సీ సుబ్బారావు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.పాల్ రాజ్, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామమూర్తి, సామర్లకోట ఎంఈఓ పుల్లయ్య, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పిల్లి గోవిందరాజులు, డి.శిరీష, పి.వీరభద్రరావు, వీవీఎం జిల్లా సమన్వయకర్త డి.శివప్రసాద్, రేయూనా ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, సాయిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓజోన్ పరిరక్షణపై సదస్సు

బాలాజీచెరువు: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా యంగ్స్ మైండ్స్(రేపటి కోసం) చారిటబుల్ ట్రస్ట్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఓజోన్ పొర పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఓజోన్ పొర, దాని పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని పేర్కొంది. ఓజోన్ పొర రక్షణకు మొక్కలు విరివిగా నాటాలని, ఏసీలు, ఫ్రిజ్‌ల వాడకం తగ్గించాలని సంస్థ అధినేత వాకాడ వెంకటరమణ అన్నారు. కాకినాడ రూరల్, అర్బన్ మండలాల్లోని పాఠశాలల్లో సంస్థ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు

కోలుకోలేని దెబ్బ

- రైతులను నిండా ముంచిన ఏలేరు వరద
- గగ్గోలు పెడుతున్న రైతాంగం


వీకే రాయపురంలో ముంపులోనే ఉన్న పొలాలు


వీకే రాయపురంలో పూడిపోయిన తూటేరు డ్రెయిన్


సామర్లకోట ఏలేరు కాలువ సమీపంలో ఉప్పవారి సత్రం వద్ద కుళ్లిన వరి పంట

సామర్లకోట: ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన అదనపు జలాల వరద నీటి కారణంగా రైతులకు తీరని నష్టం జరిగింది. వరద నీరు తగ్గడంతో మళ్లీ పొయిన వరి పంట బయటపడింది. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ సమీపంలో ఉన్న పంట భూములు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అదే విధంగా వీకే రాయపురంలో పంట భూములు సోమవారం నాటికి కూడా నీటిలోనే ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం ప్రకటించడం సరికాదని, నష్ట పరిహారాన్ని ఇంకా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు అంటున్నారు. రైతులకు పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం తిరిగి పంటలు వేయడం సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీకే రాయపురం పంట భూముల్లో ఉన్న నీరు పోవడానికి అవకాశం లేదని చెబుతున్నారు. పొలాల్లో ఉన్న నీరు తూటేరు డ్రెయిన్ మీదుగా సముద్రంలోకి వెళ్లాల్సి ఉండగా, ఆ డ్రెయిన్ పూర్తిగా మూసుకుపోయింది. తమను ఆదుకోకపోతే వ్యవసాయం చేయడం కష్టమని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు రైతుల పంటలను స్వయంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

నష్ట పరిహారం పెంచాలి

"సామర్లకోట ఉప్పవారి సత్రం వద్ద ఉన్న పంట భూములు సాధారణ రైతులకు చెందినవి. ఈ భూముల్లో వరి పంట పూర్తిగా కుళ్లిపోయింది. ఏలేరు ప్రాజెక్టు నీరు పంటను ముంచి వేసింది. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. ఏలేరు కాలువ నీటి కారణంగా వేలాది ఎకరాలకు నష్టం జరిగింది. అధికారులు స్వయంగా పరిశీలించాలి."

– కొడూరి సూరిబాబు, రైతు, సామర్లకోట



బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి

బోట్‌క్లబ్: మహిళల స్వయం ఉపాధికి బ్యూటీషియన్ కోర్సులు ఉపయోగపడతాయని లయన్స్ క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని మీనా బ్యూటీ స్కూల్‌లో లయన్స్ క్లబ్ శ్రీకారం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్ కోర్సును సోమవారం ఆయన ప్రారంభించారు. క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ, విలువైన బ్యూటీషియన్ కోర్సును క్లబ్ శ్రీకారం అధ్యక్షురాలు మీనాఫెహన్ క్లబ్ తరఫున ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసి, క్లబ్ సభ్యులు అధ్యక్షులు కోడాలి ఉమాదేవి, ఉపాధ్యక్షులు ఆకుల మల్లేశ్వరి పాల్గొన్నారు.


శిక్షణను ప్రారంభిస్తున్న ఈశ్వర్‌కుమార్